# కర్నూలు | నంద్యాల
# వార్త

21 డిసెంబర్ 2025 ఆదివారం పేజీలు 4


## ఆరాధ్యుడు, కరుణామయుడు.. ఏసుక్రీస్తుక్రీస్తు విలువలను ముందుకు తీసుకుపోవాలి



**నంద్యాల, డిసెంబర్ 20 ప్రభాతవార్త ప్రతినిధి :**

ఆరాధ్యుడు, దయామయుడు, కరుణామయుడు, ఏసుక్రీస్తు అని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. శనివారం సాయంత్రం నంద్యాల పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మైనార్టీ సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో క్రిస్మస్2025 హైటి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ... సుమారు రెండువేల ఏళ్ల క్రితం రోమ్ సామ్రాజ్యంలో జన్మించిన ఏసుక్రీస్తు ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందికి ఆరాధ్యుడు, దయామయుడు, కరుణామయుడుగా క్రైస్తవులతో ఆరాధనలు అందుకుంటున్నారన్నారు. క్రిస్మస్ పండుగ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు డిసెంబర్ 24, 25వ తేదీలలో అత్యంత ఘనంగా జరుపుకుంటారన్నారు. ప్రభుత్వం క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రభుత్వం తరఫున సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. క్రీస్తు విలువలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని క్రిస్మస్ అంటే శాంతికి చిహ్నం రాష్ట్ర ప్రజలందరూ శాంతియుతంగా, సుఖ సంతోషాలతో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని కోరుకుంటున్నానన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ మాట్లాడుతూ.... కరుణ, దయ, దాతృత్వం కలిగిన ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి దారి చూపుతాయన్నారు. యేసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ రోజును ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రిస్మస్ హైటీ కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, కేక్ కట్ చేసి క్యాండిల్ వెలిగించి క్రైస్తవ సోదరులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీ, పాస్టర్లు, క్రిస్టియన్ సోదరులు తదితరులు పాల్గొన్న

## కోటి 20లక్షల.. నిధులు.. మట్టి పాలు..!

### అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల అవగాహన లోపం..?

**ఆదోని పట్టణ ప్రజలకు దరహార్తి తీర్చడానికి ఉద్దేశించిన బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పూర్తిగా గట్లు కృంగిపోయి నీటి నిల్వను నిలుపుకొనే సామర్థం కోల్పోయింది దీంతో ఆదోని పురపాలక సంఘం గట్లను బలోపేతం చేయడానికి దాదాపు ఒక కోటి 20 లక్షలతో బండింగ్ పనులను ప్రారంభించారు 2007వ సంవత్సరంలో ప్రారంభించిన ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ గతంలో చాలాసార్లు తాత్కాలిక మరమ్మత్తులతో కాలం విల్లదీస్తున్నారు సరైన సమయంలో శాశ్వత మరమ్మత్తులను నిర్వహించి ఉంటే ఈ పరిస్థితి దాపురించేది కాదని పలువురు అంటున్నారు.**

**ఆదోని విద్య, డిసెంబర్20, ప్రభాతవార్త :**

3110 మిలియన్ లీటర్లు నిలువ సామర్థం ఉన్న ఈ ట్యాంకు మరమ్మతులకు నోచుకోక పోవడంతో కేవలం 1000 మిలియన్ లీటర్లు మాత్రమే నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది పూర్తి సామర్థంతో నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువు నందు నిల్వ చేసుకోవడం కష్టం. చెరువు చుట్టూ ఉన్న గట్లు బలహీనపడి గండి పడే పరిస్థితులు దాపరించాయి. దీంతో తాత్కాలిక మరమ్మత్తుల కింద ఒక కోటి 20 లక్షలతో నాసిరకం పనులు చేపట్టడంతో చెరువులో నీటి నిల్వను చేసుకునే పరిస్థితి దాదాపు శూన్యమేనని తెలుస్తుంది. రోజుకు 25 మిలియన్ లీటర్ల నీటిని పట్టణానికి సరఫరా చేయాల్సి ఉండగా వారం పది రోజుల్లో నీటి నిలువలు పూర్తిగా అడుగంటే పరిస్థితి నెలకొంది. చెరువుగట్లు పటిష్ట పరచడానికి నాసిరకం గోనెసంచులను వాడడం వల్ల అది కొన్ని రోజుల్లోనే నీటిలో మురిగిపోయే పరిస్థితి ఏర్పడుతుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం పాలకుల అవినీతి వల్ల కోటాది రూపాయలు ఖర్చుపెట్టినా.. ప్రజలకు త్రాగునీరు అందే పరిస్థితి లేదు



## ఖాళీ కడుపులతో.. స్పెషల్ క్లాసులు..!



- ప్రత్యేక తరగతులలో విద్యార్థుల అవస్థలు..
- కార్యచరణ ప్రణాళికలో.. సాయంత్రం అందని అల్పాహారం..
- వంద రోజుల ప్రణాళికలో పదో తరగతి ఫలితాలు ప్రశ్నార్థకం..

**" రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను తీసుకొచ్చే దిశగా ప్రవేశ పెట్టిన వంద రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ప్రతి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం పూట ఒక గంట.. సాయంత్రం పాఠశాల అయిపోయిన తరువాత మరో గంట పాటు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది.. ఈ ప్రత్యేక తరగతులకు సంబంధించి రోజు సబ్జెక్టు టీచర్లు ఈ తరగతులను తీసుకుంటూ వారిలో ప్రతిభా పాఠవాలను వెలికి తీసేందుకు గానూ రెండు గంటల పాటు ఈ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.. ఉదయం పాఠశాల ప్రారంభానికి ముందే స్పెషల్ క్లాసులకు హాజరవుతూ, సాయంత్రం వరకు పాఠశాలల్లోనే గడుపుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తప్ప ఉదయం అల్పాహారం(బ్రేక్‌ఫాస్ట్), సాయంత్రం మరో అల్పాహారం అందడం లేదు.. దీంతో విద్యార్థులు ఆకలితో నకనకలాడుతున్నా పరీక్షల ఒత్తిడితో పుస్తకాల ముందే కూర్చోవాల్సి వస్తోంది.. ఫలితాలపై దృష్టి పెట్టిన ప్రభుత్వం విద్యార్థుల మౌలిక అవసరమైన ఆహారంపై చూపు సారించకపోవడంలో వెనుకంజ వేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి"..**

**కోసిగి, డిసెంబరు 19, ప్రభాతవార్త**

పది పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది..పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్వహణతో పాటు మరి కొన్ని నిర్దిష్ట మార్గదర్శకాలు జారీ చేసింది.. కాగా 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రోజు ఒక సబ్జెక్టుపై 20 మార్కులకు పరీక్ష నిర్వహించాల్సి ఉంది.. అదే రోజు మూల్యాంకనం చేసి విద్యార్థులకు అందజేస్తారు.. తద్వారా విద్యార్థులు ఏ ఏ పాఠ్యాంశాలల్లో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని, వాటిపై మరింత దృష్టి కేంద్రీకరించేలా చూస్తారు..

ఈ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులు అర్థాకాలితోనే చదువుకోవాల్సిన పరిస్థితి నెలకుంది..ఇందుకు సంబందించి జిల్లాలో సుమారు 30 వేల మంది (పది) విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరవుతునా న్నరు..ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న వారిలో అత్యధిక మంది పేద, మధ్య తరగతి విద్యార్థులే..వీరంతా ఆయా జిల్లా పరిషత్, కస్తూరిబా, ఏపి మోడల్ స్కూల్స్ లాంటి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుంటున్నారు..కాగా ఉదయం హడావుడిగా స్పెషల్ క్లాసులకు హాజరవుతుండగా తిరిగి ఇంటికి చేరే సరికి రాత్రి అవుతోంది.. మధ్యాహ్న భోజనం తప్ప ఉదయం బ్రేక్‌ఫాస్టు, సాయంత్రం స్నాక్స్ తెచ్చుకోవడానికి సమయం లేకపోవడంతో వీరంతా అర్థాకలితో మాడిపోతున్నారు.. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు నిధుల కోసం ప్రతి సంవత్సరంఅడుక్కోవాల్సి వస్తుండడంతో ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తునా న్నరు.. ప్రభుత్వ పాఠశాలో ల్ల పదో తరగతి చదివే విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించడానికి విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. దీనికి అనుగుణంగా జిలా ల్ల అధికారులు ప్రణాళికలు అమలు చేయాల్సి ఉంది..ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తునా న్నరు.. ఇంత వరకు బాగానే ఉన్నా..విద్యార్థులు మాత్రం అర్థాకలితోనే చదువులు సాగించాల్సి వస్తోంది..కడుపు నకనక లాడుతుంటే చదువుపై దృష్టి సారించలేక పోతున్నారు..2026 మార్చిలో జరిగే పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ నెల అంటే డిసెంబరు 6వ తేది నుండే స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారు.. ఉదయం పాఠశాల ప్రారంభం కావడానికి ముందు గంట, సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత గంటకు పైగా స్పెషల్ క్లాసులు జరుగుతున్నాయి.. ముఖ్యంగా ఉదయం 8 గంటలకు పాఠశాలకు వచ్చి సాయంత్రం 6 గంటలకు తిరిగి వెళ్తున్నారు..


• వివరాలు 2లో


## స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర.. ఎక్కడ..!?

**: గ్రామాలలో కనిపించని స్వచ్ఛత**
**: మాటలకే పరిమితమైన అధికారులు**



**ప్యాపిలి డిసెంబర్ 20 ప్రభాతవార్త :**

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు, పాలకులు చెప్పే సూక్తులు మాటలకే పరిమితం చేశారు. ప్రతి రోజు పారిశుధ్య పనులను చేయకుండ నెలలో ఒక్క రోజు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పేరుతో కార్యక్రమ నిర్వహణ వల్ల ఏమి లాభమే పాలకులకే తెలియాలి. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. అయితే అమలు చేయాల్సిన అధికారులు మాత్రం కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహించి పోటోలకు పోజులు ఇస్తున్నారు. కనీసం ఒక్క రోజు కూడ కార్యక్రమాన్ని చిత్తశుద్దిగా అధికారులు నిర్వహిస్తే కొంత మేరకు పల్లెసీమలు పరిశుభ్రంగా కనిపిస్తాయి. ప్యాపిలి మండలంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఎక్కడ కనిపించదు. దీనితో గ్రామాలలో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా మారిందని పల్లె ప్రజలు వాపోతున్నారు. మండలంలోని గోపాలనగరం గ్రామంలో ప్రాథమిక పాఠశాల దగ్గర డ్రైనేజీ లేక ఇళ్ల ముందర మురికి నీరు నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. దీని వల్ల విష జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య పనుల కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా గ్రామాలు మారడం లేదని వాపోతున్నారు. గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఉన్నారా లేరా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ నిర్వహణలో అధికారులు పట్టి పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించి పల్లెసీమలను శుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరారు..

## జిల్లా కోసం కౌన్సిలర్ రాజీనామా..!

**ఆదోని డిసెంబర్ 20 ప్రభాతవార్త.**

ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తో మునిసిపల్ కౌన్సిలర్ పదవికి ఐదవ వార్డు కౌన్సిలర్ రఘునాథ రెడ్డి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా పత్రాన్ని శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ లోకేశ్వర్ కి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని జిల్లా చేయడానికి అన్ని అర్హతలు ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఆదోనినిఎందుకు జిల్లా చేయటం లేదనిఅన్నారు. ఆదోని జిల్లా సెంటిమెంటు రోజురోజుకూ బలపడుతున్నది. కావున ఆదోని ప్రాంతం లో గల ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి తమ పదవులకు రాజీనామా చేసి ఆదోని జిల్లా కోసం జరిగే పోరులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



## పర్యావరణ పరిరక్షణతోనే.. సుస్థిర అభివృద్ధి

**: స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో.. జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి**





**కర్నూలు, డిసెంబర్ 20, ప్రభాతవార్త :**

పర్యావరణ పరిరక్షణతోనే అభివృద్ధికి అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా"పర్యావరణంలో అవకాశాలు" అనే థీమ్‌తో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం అధికారులతో కలిసి మహాత్మా గాంధీ విగ్రహం వరకు నడుచుకుంటూ వెళ్లి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. సునయన ఆడిటోరియం ఆవరణలో జాయింట్ కలెక్టర్, డిఆర్వో, ఇతర అధికారులతో కలిసి చెత్తను ఊడ్చి పరిసరాలను శుభ్రం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల ద్వారా ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు, చెట్ల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణ, తడి చెత్త-పొడి చెత్త వేరు చేయడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ నెలలో "పర్యావరణంలో అవకాశాలు" కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి సంపద ఎలా తయారుచేయాలన్న అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కలెక్టరేట్ కార్యాలయాల పరిశీలనలో కారిడార్‌లలో పరిశుభ్రత లోపంపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల ఉద్దేశ్యానికి అనుగుణంగా కార్యాలయాల్లోనే శుభ్రత పాటించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, అక్కడ ఉన్న ఫైల్స్‌ను స్కాన్ చేసి ఈపిటిఎస్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను ఆదేశించారు. కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్వో సి.వెంకట నారాయణమ్మ, కలెక్టరేట్ ఏఓ శివరాముడు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## భారీగా గంజాయి స్వాధీనం.. ముద్దాయి అరెస్టు

**ఆలూరు, డిసెంబరు 20, ప్రభాతవార్త:**

చిప్పగిరి మండలంలోని దేగులపాడు గ్రామము వెలుపల ఆంజనేయస్వామి దేవుని మాన్యం పొలం సర్వే నెంబరు 176, ముల్లా మహాజిత్ ఇనామ్ పొలం సర్వే నెం.173 లో కంది మరియు మిరప పంట పొలంలో కి వెళ్ళి పరిశీలించగా గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు రాబడిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మరియు పత్తికొండ డియస్పీ వెంకట్రామయ్య ఆదేశాలతో ఆలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, ఆధ్వర్యంలో చిప్పగిరి ఎస్సై బి.సతీష్‌కుమార్, ఆలూరు ఏడిప ఎం.చెంగల్‌రాయుడు, మండల తహసిల్దార్ టిజెఎజాజ్ అహ్మద్ వెళ్ళి సర్వే నెం. 176 కంది పంటలో 50 గంజాయి మొక్కలు, సర్వే నెం.173 మిరప పంటలో గల250 గంజాయి మొక్కలు, ఎండిన గంజాయి ఆకులు, పూలు, విత్తనాలు, సుమారు 4,960 కేజీలు స్వాధీనం చేసుకొని ముద్దాయి ఊనేబాది శివయ్యను అదుపులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు.



## కుటుంబ సమేతంగా.. శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న సి.ఈ. సి.



**శ్రీశైలం ప్రాజెక్టు డిసెంబర్ 20,ప్రభాతవార్త**

అష్టాదశ శక్తిపీఠం ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మల్లన్న ను శనివారం నాడు భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దంపతులకు గంగాధర మండపం వద్ద ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు ,అర్చక స్వాములు, వేద పండితులు సాంప్రదాయపద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి విభూతి, కుంకుమ ధరింపజేసి ప్రదక్షిణ మార్గం ద్వారా ఆలయ అంతర్భాగానికి ఆహ్వానించారు. మొదటగా ధ్వజస్తంభానికి నమస్కరించి శివ సంకల్పం చేశారు. అనంతరం రత్నగర్భ గణపతి పూజ నిర్వహించారు. తరువాత మూలవిరాట్ శ్రీ మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగానికి మహా మంగళహారతి, మంత్రపుష్పం అనంతరం పంచామృతాలతో శత రుద్రాభిషేకం, బిల్వార్చన, మల్లికా పుష్పాలతో మహా మంగళహారతి భక్తిశ్రద్ధలతో నిర్వహించి దర్శనం చేసుకున్నారు. తదుపరి నందీశ్వర దర్శనం చేసి, అర్చకుల చేత స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వృద్ధ మల్లికార్జున స్వామి లఘుభిషేకం, సరస్వతి నది అంతర్వాహినిగా ప్రసిద్ధి చెందిన మల్లికాగుండం వద్ద శ్రీ స్వామివారి గర్భాలయ త్రిశూల దర్శనం చేసుకున్నారు. తదుపరి కుమారస్వామిని దర్శించుకున్నారు. తదుపరి భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దంపతులు శ్రీ భ్రమరాంబ అమ్మవారి ముఖ మండపంలో ఆది శంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఖడ్గమాలతో కుంకుమార్చన నిర్వహించి, షోడశోపచార పూజలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అనంతరం అమ్మవారి హారతి స్వీకరించారు. తరువాత అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో గ లవేదాశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేయగా, అమ్మవారి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాలు మరియు శేష వస్త్రాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం. శ్రీనివాసరావు భారత ఎన్నికల కమిషనర్ కు అందజేశారు. అనంతరం గోకులంలో గోమాత పూజను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తిక్, ఆలయ ఈఓ శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.



## డ్వాక్రా సంఘాల ఉత్పత్తులు జిల్లాస్థాయిలో మంచి పేరు తెచ్చుకోవాలి

**- మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి**

**నంద్యాల, డిసెంబరు 20, ప్రభాతవార్త ప్రతినిధిః**

డ్వాక్రా సంఘాల ఉత్పత్తులు, మండల, జిల్లాస్థాయిలో మంచి పేరు తెచ్చుకోవాలని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అకాంక్షించారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అనంతరం ఫుడ్‌స్టాల్‌ను పరిశీలించిన మంత్రి బీసీ మాట్లాడుతూ మంచి నాణ్యత ప్రమాణాలతో ఉత్పత్తులను తయారుచేస్తే మీకు అన్నివిధాల సహకరిస్తామన్నారు. అనంతరం ఎంపీడివో కారా ్యలయంలో గతంలో నాటిన మొక్కలు వాడిపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాటిన ప్రతిమొక్కను పర్యవేక్షించుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తదనంతరం బనగానపల్లె గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకుని కిరాణా వస్తువులను అందజేసే మొబైల్ క్యాంటీన్‌ను పరిశీలించారు.



## నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన.. ఐదుగురి ఉద్యోగుల తొలగింపు

**: ఉపలోకాయుక్త విచారణలో ఆరోపణలు నిర్ధారణ**
**: తెలుగుగంగ-సోమశిల ప్రాజెక్టులో నిబంధనల ఉల్లంఘన**
**: ఉద్యోగాల నుంచి బహిష్కరణతో పాటు క్రిమినల్ కేసులు**

**కర్నూలు, డిసెంబర్ 20, ప్రభాతవార్త :**

నకిలీ అవార్డు సర్టిఫికెట్లను సమర్పించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన ఐదుగురు ఉద్యోగులను సేవల నుంచి తొలగిస్తూ చర్యలు తీసుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపలోకాయుక్త పి.రజని విచారణలో పేర్కొన్నారు. తెలుగుగంగ-సోమశిల ప్రాజెక్టులో భూములు, ఇళ్ల సేకరణకు సంబంధించిన అవార్డు సర్టిఫికెట్లు నకిలీగా చూపించి కొందరు ఉద్యోగాలు పొందినట్లు పత్రికా కథనం ఆధారంగా గట్టుపల్లి మల్లెం కొండారెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఉపలోకాయుక్త, తిరుపతి లోని ఎన్‌టిఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు ప్రధాన ఇంజనీర్‌ను నివేదికను కోరారు. విచారణలో భాగంగా సమర్పించిన నివేదికల ప్రకారం, ఐదుగురు ఉద్యోగులు నకిలీ సర్టిఫికెట్లతో నిబంధనలకు విరుద్ధంగా నియామక ఉత్తర్వులు పొందినట్లు నిర్ధారణ అయింది. సంబంధిత ఉద్యోగుల వివరణలు, ఆరోపణలు, సేవా నిబంధనలను పరిశీలించిన అనంతరం వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వంను ఆదేశించింది. దీంతో ఎన్‌టిఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఐదుగురిని విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినందుకు ప్రతి ఉద్యోగిపై వేర్వేరుగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి క్రిమినల్ చర్యలు చేపట్టాలని తిరుపతి జిల్లా ఎస్పీని కోరారు. అధికారులు తీసుకున్న కఠినమైన క్రమశిక్షణా, క్రిమినల్ చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఉపలోకాయుక్త, తుది చర్యల నివేదికను నమోదు చేసి తదుపరి విచారణను నిలిపివేస్తూ ఫిర్యాదును ముగించారు. ఈ ఘటన ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకతవకలను అరికట్టడంలో లోకాయుక్త సంస్థ కీలక పాత్ర పోషిస్తున్నదని, మోసపూరిత చర్యలపై కఠినంగా వ్యవహరిస్తున్నదని స్పష్టమవుతోంది.

# టిడిపి పార్టీలోపదవి వద్దు క్యాడరు వద్దు..!?

: నమ్ముకున్న ప్రజాప్రతినిధికి వెన్నుపోటు రాజకీయాలు : పార్టీ కార్యక్రమాలకు దూరమవుతున్న నాయకులు ఎవరు..? : శ్రీశైలం నియోజకవర్గంలో రాజకీయాలని తారుమారు చేస్తున్న నాయకత్వ లోపాలు : అందరు మావాళ్లే అని పదవులు ఇస్తే నమ్మించి మోసం చేస్తున్నారు

**ఆత్మకూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు నమ్మి పదవులు ఇస్తే.. ప్రజలకు సేవలు అందించాల్సిన నాయకత్వ లోపాలు అసమతి రాజకీయాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయి శ్రీశైలం నియోజకవర్గం లో తెలుగు దేశం పార్టీ లో జరిగే రాజకీయాలు దుమ్ము దుమా రమే లేపుతున్నాయి టిడిపి పార్టీలో పదవులు వద్దు క్యాడర్ వద్దు అంటూ కొందరు నాయకులు చేస్తున్న రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు నమ్ముకున్న ప్రజా ప్రతినిధికి వెన్నుపోటు రాజకీయాలు తప్ప మరొకటి ఏమి లేదు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ స్థానిక సంస్థ ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో కొందరు నాయకుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు ప్రేమ అభిమానం చూపించిన నాయకుల్లో మా పద్ధతి ఇంతే అని ముఖంపైనే చెబుతున్నారు తాజా రాజకీయాల పరిణామాల దృశ్య ప్రజా ప్రతినిధి ప్రభుత్వ పార్టీ కార్యక్రమాలు చేపట్టినప్పటికీ పదవులు తీసుకొని పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న నాయకుల పై ఆ పార్టీలో గుసగుసలు మొదలయ్యాయి అందరూ నా వాళ్లే అని దగ్గరికి తీసి పదవుల్లో అవకాశాలు కల్పించినప్పటికీ ప్రజా ప్రతినిధి నమ్మిన రాజకీయాలు కొనసాగడం లేదు తెలుగుదేశం పార్టీలో అలజడి రాజకీయాలు ఇంకెన్నాళ్లు చేస్తారంటూ పలువురు చిన్నపాటి కార్య కర్తలు మాట్లాడుకోవడం విశేషంగా మారింది ప్రజా ప్రతినిధి అభిమానం కోసం పనిచేసే నాయ కులను కార్యకర్తలను మనం ఇదివరకే చూసే ఉంటాం అయితే నమ్ముకున్న నాయకుడు వెంట తిరుగు తూనే వెన్నుపోటు రాజకీయాలు చేయడం వెన్నతో పెట్టిన విద్యల మారిందని చెప్పవచ్చు ఏది ఏమై నాప్పటికీ శ్రీశైలం నియోజకవర్గం లో పార్టీ కోసం కష్టపడిన నాయకులకు అవకాశం కల్పిస్తే ఉత్సా హంగా పని చేస్తూ ప్రజల్లో పదవి వద్దు క్యాదరు వద్దు. అనే చర్చ జోరుగా కొనసాగుతుంది ఆత్మకూరు మండల పరిధిలో శ్రీపతిరావుపేట గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వంలో టిడిపి పార్టీ తరఫున గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలు చెందాడు. ఆ నాయకుడు ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు రాజకీయాలకు దూరంగా ఉన్నట్లు సమాచారం ఇదే తరహా లోనే ఆత్మకూరు పురపాలక సంఘంలో ఓ నాయకుడు పదవులు క్యాడర్ ఉన్న పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడం అసంతృప్తి వ్యక్తం చేసే రాజకీయాలను కొనసాగిస్తున్నారు ఏది ఏమైనప్పటికీ టిడిపి పార్టీలో పదవులు ఉన్నా లేకపోయినా ప్రజా ప్రతి నిధి కోసం రాజకీయం చేసే నాయకులు వేరేగా ఉన్నప్పటికీ ప్రజల కోసం రాజకీయం చేసే నాయ కులు నేటికీ అసంతృప్తిగానే కనిపిస్తున్నారు పద వులు వద్దు క్యాడర్ వద్దు అనే నాయకులను పార్టీ నుంచి తప్పించి యువ నాయకత్వానికి అవకాశం కల్పిస్తారా లేక ఇలాగే నిరుత్సాహ రాజకీయాలు కొనసాగిస్తారని విషయాన్ని వేచి చూద్దాం

## నియోజకవర్గంలో టిడిపి ధౌర్జన్యాలు పెరిగి పోయాయి

– వైసిపి ఇన్‌చార్జ్ డాక్టర్.దారా సుధీర్



**నందికొట్కూరు, డిసెంబరు 20, ప్రభాతవార్త:** నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకుల ధౌర్జన్యాలు పెరిగి పోయాయని అంతా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని వైసిపి నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్. దారా సుధీర్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు దాటుతున్న ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, కేవలం వైసిపి నాయకులపై కార్యకర్తలపై దాడులకు పాల్పడుతు, కేసులు పెడుతు, అవినీతికి పాల్పడుతున్నారని, పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని,ఇంత వరకు అనేక చోట్ల వైసిపి నాయకులపై దాడులు జరిగిన కేసు పెట్టిన నమోదు చేయడంలేదని, అంతే కాక ముచ్చుమర్రిలో మైనర్ బాలిక ఆచూకి లేదని, బాలిక తల్లిదండ్రులకు ఎలాంటి సహాయం చేయలేదని, మాజీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్ రూ.10 లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. పట్టణంలో విచ్చలవిడిగా డ్రగ్స్ తయారు అవుతున్నాయని, తెలంగాణ పోలీసులు వచ్చి పట్టుకునేంత వరకు మన పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని, నందికొట్కూరు నియోజకవర్గాన్ని డ్రగ్స్ తయారి కేంద్రంగా మార్చారని దీంతో ప్రజలు తీవ్ర అంధోళనకు గురి అవుతన్నారన్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చాక్లెట్ తిని 11 మంది బాలికలు అస్వస్థతకు గురికాగా పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉడకని నాణ్యత లేని కోడిగ్రుడ్లు పెట్టడంతో విద్యార్థులు తీవ్ర అంధోళనకు గురై రోడ్డెక్కారని అయిన అధికారులు స్పందించడం లేదని దీనిపై ఎమ్మెల్యే చర్యలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం 18 నెలల పాలనలో రైతులను విస్మరించిందని అంతేకాక విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్స్‌మెంట్, వసతి దీవెన వంటి పథకాలు పూర్తిగా ఎత్తివేసిందని, పేద విద్యార్థులకు వైద్య విద్యా అందకుండా ప్రైవేటీకరణకు సిద్ధమైందన్నారు. ప్రజలలో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని 2029లో వైసిపి అధికారం చేపట్టి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ఆయన జోస్యం చెప్పారు. రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి మాదూరిగౌడ్, నాయకులు జబ్బారుమియ్య, మన్సూరుఅహ్మద్, లడ్డు, ల్యాబ్ రవి, చింతావిజ్జి, చరణ్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల హక్కుల సాధనకై ఉద్యమాలు తప్పవు



**ఆలూరు,డిసెంబరు 20, ప్రభాతవార్త:** న్యాయవాదుల హక్కుల సాధన కోసం అవసరమైతే ఉద్యమాలు చేపడుతామని ఇండియన్ అడ్వకెట్స్ లీగ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.కృష్ణయ్య తెలిపారు. శనివారం ఆలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 2026 సంవత్సరానికి సంభందించిన డైరీలు, క్యాలెండర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతు 1982 సంవత్సరంలో జస్టిస్ నేతృత్వంలో భారత న్యాయవాదుల సంఘం ఆవిర్భవించిందని, అప్పటి నుంచి నేటి వరకు దేశ వ్యాప్తంగా న్యాయవాదుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని ఆయన తెలిపారు. న్యాయవాదుల వవృత్తి గౌరవాన్ని కాపాడటం, సంక్షేమ కోసం పోరాటాలు చేయడం ఐఏఎల్‌ప్రధాన లక్ష్యమని ఆన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆఆలూరు బార అసోసియేషన్ సభ్యులు వాయు జీవోత్తమరావు, లక్ష్మీకాంత్, ప్రసాఆద్, వీరన్నరావు, రంగన్న, అడ్వకెట్ క్లర్క్ శీనప్ప, సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, న్యాయవాదులు పాల్గొన్నారు,.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**నందికొట్కూరు,డిసెంబరు 20,ప్రభాతవార్త:** ఈ నెల 21న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్.దివ్య తెలిపారు. పట్టణంలో పల్స్ పోలియో వలన కలిగే ప్రయోజనాలను తెలుపుతు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్.దివ్య మాట్లాడుతు పట్టణంలో 25 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే దాదాపు 6 వేల మంది చిన్నారులను నమోదు చేయడం జరిగిందని వీరందరికి కేంద్రాలలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు పోలియో చుక్కలు సిబ్బంది వేస్తారని, ఇంకా ఎవరైన మిగిలి ఉంటే 22,23, ఇంటింటికి తిరిగి విచారించి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో డాక్టర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు, పాల్గొంటారని డాక్టర్. తెలిపారు.

## ఉపాధి హామీ చట్ట మార్చడం విరమించుకోవాలి

**పత్తికొండ,డిసెంబరు 20,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని జిరాంజీ పథకముగా మార్చడంపై వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీవో భరత్‌నాయక్ కు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహ్మరించుకోవాలని లేని పక్షంలో ఆంధోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని నాయకులు తెలిపారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నరసన్న, రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్యగౌడ్, ఉపాధి మామీ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మండల విఆర్ఏల నూతన కమిటీ ఏర్పాటు

**జూపాడుబంగ్లా, డిసెంబరు 20, ప్రభాతవార్త:** జూపాడుబంగ్లా మండలం విఆర్ఏల(గ్రామ సహాయకులు) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు జి.మల్లికార్జునుడు తెలిపారు. శనివారం జరిగిన ఈ ఎంపికలో మండల ఉపాధ్యాక్షుడుగా ఎల్లనాయుడు, మండల కోశాధికారిగా ఎన్.ఆంజనేయులు, మండల కార్యదర్శిగా ఎం.రమణ, మండల సహాయ కార్యదర్శిగా ఖాసీం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ విఆర్ఏల సమస్యల పరిష్కారానికై కృషి చేస్తుందని వారు తెలిపారు.

## పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**తుగ్గలి,డిసెంబరు 20,ప్రభాతవార్త:** పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని అయుర్వేదిక్ అమర్నాథ్, డాక్టర్ కిరణ్‌లు పిలుపు నిచ్చారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలి పల్స్‌పోలియోపై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతు అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ళ లోపు చిన్నారులకు పోలియో మందు వేయించాలని వారు తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన కోరారు. ఈ కార్య క్రమంలో ఎంపిహెచ్‌వో వెంకటరమణయ్య, పిహెచ్ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్లు నాగమమ,, హెల్త్ అసిస్టెంట్ ఎరామాంజనేయులు, హెల్త్ కార్యదర్శి పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయుదు చందునాయక్, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాలూకా ఏపీ ఎన్జీవో నూతన కార్యవర్గం ఏర్పాటు

**పత్తికొండ, డిసెంబరు 20, ప్రభాతవార్త :** పట్టణంలోని ఎన్జీవో కార్యాలయంలో పత్తికొండ తాలూకా ఏపీ ఎన్జీవో నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సభ్యులైన మద్దిలేటి మరియు వరప్రసాద్ ఆధ్వర్యంలో కార్యవర్గం ఏర్పాటుకు నామినేషన్లు వేశారు. అన్ని పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో సంఘం అధ్యక్షుడు సాయిబాబా వారి ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు తెలిపారు,. ఇందులో సంఘం అధ్యక్షుడుగా సాయిబాబా(మెడికల్)సెక్రటరీగా రమేష్, వార్డన్ అసోసియేట్ ప్రసిడెంట్‌గా నాగేంద్ర, రెవిన్యూ ఉపాధ్యాక్షులుగా బాలకృష్ణ, ట్రెజరీగా రవికుమార్, శ్రీధర్,, జాయింట్ సెక్రటరీగా బి.ప్రకాష్, శ్రీనువాసులు, నాగరాజు, జయలక్ష్మి, రంగనాథ్, ఎన్నిక అయినట్లు ప్రకటించారు. అధ్యక్షుడు సాయిబాబా మాట్లాడుతు రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## ఉపాధి హామీ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ప్రధాని పోటోలు ధగ్దం



**నందికొట్కూరు,డిసెంబరు 20,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఉపాధి హామీ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శనివారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేసి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రాలను(పోటోలు) ధగ్దం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతు కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి ఎత్తివేయాలనే కుట్రలో భాగంగా జాతిపిత మహాత్మగాంధీ పేరు తొలగించి వి.బి.జి.రామ్‌జీగా పేరు మార్పు చేయదానికి ప్లామెంట్‌లో అమోదం పెట్టడం దారుణమన్నారు. ఉపాధి జీవించే హక్కులో భాగమని గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించేందుకు 2005లో వామపక్ష పార్టీల ఒత్తిడి మేరకు యూపిఏ ప్రభుత్వం ఆనాడు చట్టం చేయడం జరిగిందని, వీటి మూలంగా గత 20 ఏళ్లుగా వ్యవసాయ కార్మికులు వలసలు వెళ్ళకుండా తాము ఉన్న ప్రాంతంలోనే ఉపాధి పనులు చేసుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. కావున కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి పి.పక్కీర్‌సాహెబ్, సిఐటియు పట్టణ అధ్యక్షులు టి.గోపాలకృష్ణ, జిల్లా నాయకులు బెస్తరాజు, మహిళా సంఘం నాకురాలు సాజిదాబి, ఎం,కర్ణ, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

**రుద్రవరం, డిసెంబరు 20, ప్రభాతవార్త:** ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల స్పెషల్ అధికారి ఎస్ రహిమాన్ తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వ్యక్తిగత మరియు సమాజ పరిశుభ్రతపై మండల పరిషత్ కార్యాలయం నుండి అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బందితో ర్యాలీలో స్లోగన్లు పలుకుతూ నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు సిబ్బంది సమాజ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డిప్యూటి ఎంపీడివో జిఎస్‌డబ్ల్యుఎస్ ప్రసాద్‌రెడ్డి, మండల పర్యవేక్షణ అధికారి సుబ్రమణ్యం, సీనియర్ అసిస్టెంట్ నూర్ మహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ హరికిషన్, పంచాయితీ ఇంచార్జీ కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, విఆర్వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖాళీ కడుపులతో.. స్పెషల్ క్లాసులు..!

(మొదటి పేజీ తరువాయి ) : ఖాళీ కడుపులతోనే క్లాసులకు:

ప్రభుత్వ పాఠశాల్లో ఎక్కువగా పేద, మధ్య తరగతి విద్యార్థులే చదువుకుంటునా న్నరు.. స్పెషల్ క్లాసులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి త్వరగా బయలుదేరడంతో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ కానీ, భోజనం కానీ చేయలేక పోతునా న్నరు. మధ్యాహ్నం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్నా. తిరిగి ఇంటికి చేరుకునే సరికి రాత్రి అవుతుండడంతో అప్పటి వరకు ఆకలితో అలమటిస్తున్నారు.. ప్రతి ఏటా నిర్వహిస్తున్న స్పెషల్ క్లాసులకు హజరయ్యే విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందజేయాల్సి ఉంది. కొన్ని పాఠశాలల్లో దాతల సహాయంతో ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున ఖర్చు చేస్తూ బిస్కట్లు, పండ్లు, మిక్చర్ లాంటివి ఏదో ఒకటి అందించేవారు. అయితే ఈ సారి దాతలు ముందుకు రాకపోవడంతో స్పెషల్ క్లాసులు ప్రారంభమైనా విద్యార్థులకు స్నాక్స్ అందించడం లేదు. దీంతో విద్యార్థులంతా ఆకలితోనే పాఠాలు వినాల్సి వస్తోంది.. ఇప్పటికైనా అధికారులు విద్యార్థుల ఆకలి తీర్చే మార్గం ఆలోచిస్తారో.. లేదో వేచి చూడాల్సిందే..

## సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతాం



**హాలహర్వి, డిసెంబరు 20, ప్రభాతవార్త;** సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని ఎస్ఐ ఈశ్వరరావు పేర్కొన్నారు. హాలహర్వి నూతన ఎస్ఐగా ఈశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో హాలహర్వి ఎస్ఐగా పనిచేస్తున్న మారుతి కర్నూలుకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కోసిగిలో పని చేస్తున్న ఎస్ఐ ఈశ్వరరావును హాలహర్వి ఎస్ఐగా నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు.

## విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటించాలి



**పాములపాడు, డిసెంబరు 20, ప్రభాతవార్త:** విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని మండల ప్రత్యేక అధికారి ఎంఎన్‌వి రాజు, ఎంపీడివో చంద్రశేఖర్, తహశీల్దార్ సుభద్రమ్మ విద్యార్థులకు సూచనలు చేశారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ముస్తాబు కార్యక్రమంలో భాగంగా పాములపాడు ఏపీ మోడల్‌స్కూల్ నందు విద్యార్థులకు శుభ్రతపై సూచనలు చేశారు. విద్యార్థిని విద్యార్థులు తమ గోర్లను నీట్‌గా కట్‌చేసుకొని తలను శుభ్రంగా దువ్వుకొని ఎలాంటి వ్యాధులు సంభవించకుండా వ్యక్తిగత శుభ్రతను పాటించాలని అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు మొక్కలు నాటేందుకు అందరికి అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచనలు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాగరవీంద్ర, ఫిజికల్ డైరెక్టర్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అందరు భాగస్వాములు కావాలి



**కొత్తపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త:** స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములై గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు తోడ్పాటు అందించాలని కొత్తపల్లె తహశీల్దార్ ఉమా రాణి అన్నారు. ఆమె శనివారం మండల కేంద్రం కొత్తపల్లెలో సర్పంచ్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్య క్రమాల్లో భాగంగా వీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ ఉమా రాణి మాట్లాడుతూ కేంద్రంలోని వీధుల వెంట అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ అందరి ఇళ్లు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోడ్ల వెంట చెత్తా చేదారం వేయరాదని, డ్రైనేజీల్లో వ్యర్థాలు వేయరాదన్నారు. ప్రతిఒక్కరు పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమం అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే ప్రతినెల 3వ శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డలో ఎరువుల దుకాణాల తనిఖీలు



**ఆళ్లగడ్డ, డిసెంబరు 20, ప్రభాతవార్త:** ఆళ్లగడ్డ పట్టణంలోని ఎరువుల దుకాణాలను జిల్లా డిప్యూటి వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని మహాలక్ష్మి ఎరువుల దుకాణంలోని పలు రికార్డులను పరిశీలించారు. గోదాములోని ఎరువులు, పురుగుల మందులను నిల్వలను తనిఖీచేశారు. ఆయన మాట్లాడుతూ పురుగుల మందులు, ఎరువులను ఎమ్మార్పి కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ అధికారి విజయశేఖర్, మండల వ్యవసాయ అధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాయిప్రసాద్‌రెడ్డి ఆదోని ప్రాంతానికి చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు తెలుసు



**ఆదోనిటౌన్, డిసెంబరు 20, ప్రభాతవార ;** ఆదోని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వై.సాయిప్రసాద్‌రెడ్డి ఆదోని ప్రాంత అభివృద్ధికి చేసిన మేలు, అభివృద్ధి గురించి ఆదోని ప్రాంత ప్రజలకు తెలుసునని వైఎస్సార్‌సీపీ పార్టీ పట్టణాధ్యక్షుడు బి.దేవా పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడుసార్లు ఆదోని ఎమ్మెల్యేగా సాయిప్రసాద్‌రెడ్డి గెలుపొంది ప్రజలకు సేవ చేశారన్నారు. ఆదోని పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. సాయిప్రసాద్‌రెడ్డి అంటే ప్రజలకు ఓ నమ్మకమని చెప్పారు. 18 నెలల పాలనలో బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి ఏమి అభివృద్ధి చేశాడో చూపించాలని ప్రశ్నించారు. ప్రజలకు కల్లిబుల్లి మాటలు చెబుతూ అభివృద్ధి చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. ఆదోనికి మెడికల్ కాలేజీ, బైపాస్ రోడ్డుతో పాటు వంద పడకల ఆసుపత్రి, మాతాశిశు ఆసుపత్రి, ఎంఐజీ, ఎల్ఐసీ, హెచ్ఐజీ మహవీర్ కాలనీ, ఇంద్రానగర్‌లో పార్కులు, రాంజల చెరువు అభివృద్ధి, మైనార్టీ పిల్లల కోసం కొటి నుంచి 10 వరకు ఆరేకల్‌లో రెసిడెన్షియల్ స్కూలు, మైనార్టీ ఉర్దూ ఇంటర్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీలన్నీ ఎమ్మెల్యేగా సాయిప్రసాద్‌రెడ్డి ఉన్న సమయంలోనే జరిగాయన్నారు. టిడ్కో ఇళ్లకు రూ.2100 కట్టిన వారందరికీ పట్టాలివ్వడం జరిగిందన్నారు. అమరావతి నగర్, విజయభాస్కర్‌రెడ్డి నగర్, వైఎస్సార్ నగర్, భీమిరెడ్డి నగర్, మైనార్టీ కాలనీ, నారాయణగుంలో అక్కడ ఉన్న పేదలకు కూడా పట్టాలు ఇచ్చామన్నారు. ఇలాంటి చెప్పుకుంటూ పోతే అనేక అభివృద్ధి కార్యక్రమాలు సాయిప్రసాద్‌రెడ్డి హయాంలోనే జరిగాయన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా బీజేపీ ఎమ్మెల్యే, నాయకులు వైఎస్సార్‌సీపీ పార్టీపైన, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపైన బురదజల్లే మాటలు మాట్లాడడం మానుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ టౌన్ ప్రెసిడెంట్ ఉప్పరి నారాయణ, ప్రధాన కార్యదర్శి గంగాధర్, నాగరాజు, పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్షులు మల్లి, జిల్లా కార్యదర్శి మణి, ఉప్పరి శీన పాల్గొన్నారు.

## పరిశుభ్రతతో ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పిద్దాం



**హాలహర్వి, డిసెంబరు 20, ప్రభాతవార్త;** పరిశుభ్రతను పాటించి ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు చేయూతనిస్తూ ముందుకు నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీఓ వరలక్ష్మీ అన్నారు. శనివారం మండలకేంద్రమైన హాలహర్విలో పరిశుభ్రత, పచ్చదనంపై ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకని గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజా జీవనానికి ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడం ఎలాంటి రోగాలు దరి చేరవన్నారు. క్రమం తప్పకుండా ఇంటింటి చెత్త సేకరణ, పారిశుధ్యం పనులు, మొక్కలు పెంపకం వంటి పనులు చేపట్టి గ్రామాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్‌డీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు ఓంప్రకాష్, నరసింహా, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పక పోలీయో చుక్కలు వేయించాలి



**పగిద్యాల, డిశంబరు 20, ప్రభాతవార్త :** ఐదేళ్లలోపు పిల్లలందరికి తప్పనిసరిగా పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలనీ ప్రాథమిక వైద్యాధికారులు అనిల్ కుమార్, కృష్ణమూర్తిలు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాటు సిద్ధం చేశామనీ, మండలంలో మొత్తం 3వేలమంది 0–5 యేళలోపు చిన్నారులను గుర్తించామన్నారు. పోలియో చుక్కలు వేసేందుకు 26బూతులు, 3500వాక్సిన్‌డోస్‌లు సిద్ధం చేశామన్నారు. ఈకార్యక్రమంలో 9మంది ఎంఎల్‌హెచ్‌పిలు, 10మది ఏఎన్ఎంలు, 40మంది అంగన్వాడీ టీచర్లు, 30మంది ఆశాకార్యకర్తలను నియమించామని తెలిపారు. అందరు కలిసి పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కోరారు. శనివారం ఏపి మోడల్‌స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల నుండి జెడ్పీపాఠశాల విద్యార్థినీ విద్యార్థులు కలిసి పాఠశాల మీదుగా ఎంపిడిఓ కార్యాలయం, ఎంఈఓ కార్యాలయం మీదుగు భారీ ర్యాలీ నిర్వహించారు. రెండు చుక్కలు– నిండు జీవితం, పోలియోచుక్కలు వేయించాలి అనీ విద్యార్థినీ, విద్యార్థులు చేసిన నినాదాలు పురవీదులలో మారు మ్రోగాయి. బస్టాండులో మానవహారం నిర్వాహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్, ఎంపిడిఓ శ్రీమతి సుమిత్రమ్మ ఎంఈఓ సుభాన్, డిప్యూటీ ఎంపిడిఓ అబ్బుర్ రహీం మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలనీ, పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామనీ అందుకు అందరిసహకారం ఎంతైనా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, ఎంఈఓ యం.మురళీమోహన్‌రెడ్డి, మండల జిఐఎస్‌డబ్ల్యూఎస్ అధికారి అబ్దుల్ మన్సూర్, జెడ్పీపాఠశాల హెచ్ఎం మధుసూధనరావు, ఎపిఓ మద్దిలేటి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు యువత మండలాధ్యక్షుడిగా బకాడి వీరేష్ ఎంపిక



**హొళగుంద, డిసెంబరు 20, ప్రభాతవార్త;** హొళగుంద మండల టీడీపీ తెలుగు యువత మండలాధ్యక్షుడిగా బకాడి వీరేష్ నియమితులయ్యారు. తన సేవలను గుర్తించిన తెలుగు యువత మండలాధ్యక్షుడిగా నియమించిన ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్, మండల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తెలుగు యువత మండలాధ్యక్షుడు వీరేష్‌ను పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

## సైన్స్ ప్రాజెక్టులో రాష్ట్రస్థాయికి శశిధర్ ఎంపిక




**రుద్రవరం, డిసెంబరు 20, ప్రభాతవార్త:** జిల్లాస్థాయిలో ఈనెల 19న నిర్వహించిన జాతీయ సైన్స్‌డే కార్యక్రమంలో రుద్రవరం ఆదర్శపాఠశాలలో 9వ తరగతి విద్యార్థి శశిధర్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు శనివారం ప్రిన్సిపాల్ సంగేపు నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీలో భాగంగా మీని వాటర్ క్రెన్ అంశంపై రూపొందించిన వినూత్న శాస్త్రీయ ప్రాజెక్టులో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఆదర్శపాఠశాలకే కాకుండా మండానికి కూడ గర్వకారణంగా నిలిచిందన్నారు. పర్యావరణ పరిరక్షన పునరుత్పాదక శక్తి, వనరుల ప్రాధాన్యతను ప్రతిబించేవిధంగా రూపొందించిన ఈప్రాజెక్టులో మా విద్యార్థి శశిధర తన సృజనాత్మకత శాస్త్రీయ అలోచన ప్రయోగాత్మక నైపుణ్యాలను చాటిచెప్పారు. జిల్లాస్థాయి పోటీల్లో న్యాయనిర్ణేతలు డిఈవో జనార్థన్‌రెడ్డితో ప్రశంసలు అందుకొని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం విశేషంగా ఉందన్నారు. ఈవిజయానికి పాఠశాల సైన్స్ ప్యాకల్టీ అందించిన నిరంతర మార్గనిర్దేశం కీలకంగా మారిందన్నారు. ఇంచార్జీ ప్రధానోపాధ్యాయురాలు రజనీ, సైన్స్ ప్యాకల్టీ లలిత, నజియా, మున్నిసా బేగం, సుప్రియ, వీరప్రకాష్, అగ్రికల్చరల్ జ్యోతి, ప్రాజెక్టు రూపకల్పన భావన స్పష్టత శాస్త్రీయ విశ్లేషణలో అందించిన వారి సహకారం అభినందనీయం అన్నారు. ఉపాధ్యాయ బృందం సమిష్టికృషిచేయడం వల్ల ఈవిజయానికి బలమైన అధారంగా నిలిచిందన్నారు. ఈవిజయానికి కారకులైన విద్యార్థి శశిధర్‌కు, సైన్స్ ప్యాకల్టీకి అగ్రికల్చర్ ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులకు, పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## జాతీయ విద్యావిధానం 2020ని రద్దుచేయాలి



**కర్నూలు విద్య, డిసెంబరు 20, ప్రభాతవార్త:** ప్రస్తుత విద్యా విధానాల వల్ల ప్రభుత్వ విద్య తీవ్రంగా దెబ్బతింటుందని ప్రైవేటీకరణ వ్యాపారి కరణ విధానాల కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు విద్య దూరం అవుతుందని అవేదన వ్యక్తం చేశారు. శనివారం అల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ ఆధ్వర్యంలో నేషనల్ పిపుల్స్ పార్లమెంటులో అమోదించబోయే ప్రజా విద్యావిధానం ముసాయిదాపై విస్తృత చర్చ కోసం ఆదివారం నగరంలోని డా.బ్రహ్మరెడ్డి కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వర్కుషాపు నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఈసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి రామశేషయ్య తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలను కేంద్రంగా చేసుకున్న ప్రజా విద్యా విధానం (పిఈపి–2025) ముసాయిదాను రూపొందించామని దీనిపై ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యావేత్తలు మేధావుల అభిప్రాయాలు సేకరించేందుకు ఈవర్కుషాపు నిర్వహిస్తున్నామని తెలిపారు. శనివారం నగరంలోని ఉపాధ్యాయులను కలిసి వర్కుషాపుకు హాజరుకావాలని ఆహ్వానిస్తు విస్తృత ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా విద్యను కాపాడాలని అందోళన కలిగిన ఉపాధ్యాయులు, విద్యాభిలాషులు అందరు ఈవర్కుషాపులో పాల్గొని తమ సూచనలు, అభిప్రాయలు తెలిపాలన్నారు.

## నాటుసారా రహిత సమాజమే లక్ష్యం



**ఆదోనిటౌన్, డిసెంబరు 20, ప్రభాతవార్త;** నాటుసారా రహిత సమాజమే లక్ష్యమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం ఎక్సైజ్ సీఐ సైదుల్ ఆధ్వర్యంలో పాత నేరస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ సుధీర్‌బాబు పాల్గొని మాట్లాడారు. గతంలో నాటుసారా తయారీ, విక్రయాల్లో ఉండి పాత నేరస్థులుగా ముద్రపడిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే ముఖ్య ఉద్దేశమన్నారు. నాటుసారా తయారీని వదిలిపెట్టి గౌరవప్రదమైన జీవనం సాగించాలనుకునే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పాత నేరస్థుఉ తమ తప్పును దిద్దుకుని కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తామన్నారు. వివిధ బ్యాంకుల సహకారంతో అర్హులైన వారికి లోన్లు మంజూరు చేస్తామన్నారు. ద్వారా చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకుని ఆర్థికంగా స్థిరపడే అవకాశం కల్పిస్తామన్నారు. నాటుసారా వల్ల అనేక కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. ఆ మార్గాన్ని వీడి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెప్మా కో ఆర్డినేటర్‌లు వీరారెడ్డి, జావేద్, డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, ఎక్సైజ్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం చూపాలని తహసీల్దార్‌కు వినతి



**హొళగుంద, డిసెంబరు 20, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన హొళగుందలో వాల్మీకుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని మండల వాల్మీకి సంఘం నాయకులు డాక్టర్ తిప్పయ్య, కె.దుర్గయ్య, బాబయ్య తదితరులు తహసీల్దార్ నిజాముద్దీన్‌ను కోరారు. శనివారం తహసీల్దార్ నిజాముద్దీన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక బీసీ కాలనీలోని 1వ వార్డు, 7వ వార్డు, 8వ వార్డుకు ఆనుకుని ఉన్న సామూహిక మరుగుదొడ్ల స్థలాన్ని కమ్యూనిటీ హాల్ కొరకు కేటాయించాలన్నారు. ఆ స్థలం అన్యాక్రాంతం కాకుండా సంబంధిత స్థలాన్ని వాల్మీకి భవన్, అవసరాల కోసం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు రమేష్, కోనేరు కాలనీవాసులు హమాలీ ఈరన్న, గాదిలింగ, ఆదెప్ప పాల్గొన్నారు.

# కొనుగోలుదారులు మోసపోకుండా జాగ్రత్తలు పాటించాలి

**: వస్తువులు, సామాగ్రి, తినుబండరాలు కొనుగోలు సమయాలలో ఎమ్మార్పీ ధర, తయారీ చేసిన డేటు గమనించాలని జిల్లా కన్స్యూమర్ ఫోరం జడ్జి కరణం కిషోర్ కుమార్ సూచించారు**




**ఆదోని క్రైమ్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** ఆదోనిలోని అక్షర శ్రీ కళాశాలలో వినియోగదారుల రక్షణ మండలి డివిజన్ అధ్యక్షుడు సీనియర్ జర్నలిస్టు ఈసా బాష ఆధ్వర్యంలో ర్యాలీ తో పాటు అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల నుండి ఎస్.కే.డి కాలనీ, పశువుల ఆసుపత్రి బీమాస్ సర్కిల్ మీదుగా ప్లే కార్డులు ధరరించి అవగాహనర్యాలీ నిర్వహించారు వినియోగదారుల చట్టాన్ని విద్యార్థులకు వివరిస్తూ చట్టాన్ని తమ హక్కుగా వినియోగించుకోవాలని జిల్లా జడ్జి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వస్తువు సామాగ్రి కొనుగోలు జరిగిన సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు కొనుగోలు జరిగిన వస్తువు సామాగ్రిలో నాణ్యత లేకపోయినా పనిచేయక పోయినా కన్స్యూమర్ కోర్టులో విక్రయ దారుడు పై కేసు వేసి పరిహారం పొందే వెసులుబాటు ఉందని ఆయన తెలిపారు ఎవరు నష్టపోకుండా చూడడమే కన్స్యూమర్ ఫోరం ఉద్దేశం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఐఏఎస్, డి.ఎస్.ఓ రాజా రఘు వీర్ ఆదేశాల మేరకు ఆదోని డివిజన్ వినియోగ దారుల రక్షణ మండలి అధ్యక్షుడు ఈస బాషా ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా ఆదోనిలో జాతీయ వినియోగదారుల వారోత్సవం ఘనంగా జరిగింది.. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫోరం జడ్జ్ కరణం కిషోర్ కుమార్. జిల్లా కన్స్యూమర్ సమాచార కేంద్రం ఇంచార్జ్ శివ మోహన్ రెడ్డి, జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యురాలు నాజిమ బేగం, ఆదోని తహసిల్దార్ శేష ఫణి డిప్యూటీ తహసిల్దార్ రుద్ర గౌడ్ ,సీనియర్ న్యాయవాది మన్సూర్ అహ్మద్,ఆదోని డివిజన్ వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ ఈస బాషా, అక్షర శ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ రెడ్డి వినియోగదారుల రక్షణ మండలి ఉపాధ్యక్షులు గౌసుల్ వర, కార్యదర్శి గౌస్ నిజామి, ఉప కార్యదర్శి మజ్హార్ కోశాధికారి నరసింహ, సభ్యులు ఈరన్న,స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ అధ్యక్షురాలు శారదా కాలేజ్ లెక్చరర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తితో ఆడి పతకాలు గెలవాలి



**కర్నూలు విద్య, డిసెంబరు 20, ప్రభాతవార్త:** క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడి పథకాలు గెలవాలని క్లస్టర్ యూనివర్శిటి రిజిస్ట్రార్ డా.జి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం క్లస్టర్ యూనివర్శిటి పుట్బాల్ క్రీడాకారులకు కిట్లు పంపిణి చేశారు. ఈసందర భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ క్రీడాకారులకు మంచి గుర్తింపు ఉందని గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడల్లో ఎక్కువ సమయస్ఫూర్తి ఉండాలని తొందరపడితే విజయాలు వరించవన్నారు. క్లస్టర్ యూనివర్శిటి స్పోర్ట్స్ సెక్రెటరీ వై శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 30 వరకు యూనివర్ శిటి అఫ్ కాలికట్ కేరళలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్ శిటి ఫుట్‌బాల్ మెన్ చాంఫియన్‌షిప్ పోటీలకు క్లస్టర్ యూనివర్శిటి టీమ్ ఆదివారం వెళ్తుందన్నారు. ఈటీమ్‌లో సిల్వర్ జూబ్లి జి డి సి ఫర్ మెన్ కళాశాల విద్యార్థులు 16 మంది ఉంటారని టీమ్ కెప్టెన్ అజయ్, టీమ్ మేనేజర్ ఫణి నిఖీల్ హర్ష, కోచ్ విజయ్‌కుమార్ టీంతో వెళ్తారన్నారు. ఈకార్యక్రమంలో క్లస్టర్ యూనివర్శిటి సిల్వర్ జూబ్లి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.బిఆర్ ప్రసాద్‌రెడ్డి, డా.నాగరాజ్ శెట్టి, డా.ఎం నాగ అరున్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నంద్యాలలో ఈనెల 23న మెగా జాబ్ మేళా

**నంద్యాల, డిసెంబరు 20, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాల నంద్యాలలో ఈనెల 23న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈమెగా జాబ్ మేళాలలో ఎన్ఐఐటి-యాక్సిస్ బ్యాంకు, స్టార్ టెక్, బ్లూ స్టార్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, ఎం టూర్ ప్రైవేట్ లిమిటెడ్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు (మణిపాల్), ఆర్బిఎల్-ఎన్ఐఐటి, సిఐఐ-ఎంసిసి విజయవాడ, సువిధ స్టాఫింగ్ సర్వీసెస్, క్యాండీ మార్క్స్, యూనికో స్టాఫ్ సోల్యూషన్స్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ ప్రైవేట్ లిమిటెడ్, పుష్కల అగ్రోటెక్, టివిఎస్ టీఎస్, టాటాఎలక్ట్రానిక్స్, శ్రీరాం లైఫ్ ఇన్సురెన్స్, హైటిరో ల్యాబ్స్, మెడ్‌ప్లస్, హుండాయ్, గ్లోవిస్, నంది గ్రూప్, జి ఆర్ ఇంటర్ క్రైమ్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర 21 కంపెనీలుపాల్గొంటున్నట్లు తెలిపారు. ఈజాబ్ మేళాలో టెన్తు, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, బి ఫార్మసీ, డి ఫార్మసీ, ఎం ఫార్మసీ, డిగ్రీ, బిటెక్, పీజీ, పూర్తిచేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చని 18 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు గల వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఈమ విద్యార్హత సర్టిఫికెట్లు, అధార్‌కార్డు, రెస్యూమ్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకురావాలని సూచించారు. వివరాల కోసం 9551400588, 8297812530 నంబర్లు లేదా హెచ్‌టిటిపిఃనైపుణ్యం.ఏపీ.జివోవి.ఇన్ వెబ్‌సైట్ సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

## జీజీహెచ్‌లో స్టాఫ్ క్యాంటీన్ అలాట్మెంట్ చేయాలి



**కర్నూల్ హాస్పిటల్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో స్టాఫ్ క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు హెచ్‌డీఎస్ సమావేశంలో చేసిన తీర్మానం మేరకు అలాట్మెంట్ ఆర్డర్ కాపీ మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కోరింది. జూలై 26, 2024న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించగా, ఏప్రిల్ 14, 2025న జరిగిన హెచ్‌డీఎస్ సమావేశంలో"నో లాస్ – నో బెనిఫిట్" విధానంలో నామినల్ రేట్లకు క్యాంటీన్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేసినట్లు యూనియన్ తెలిపింది. ఈ నేపథ్యంలో వెంటనే అలాట్మెంట్ ఆర్డర్ జారీ చేయాలని కోరింది.

## ప్లాస్టిక్ రహిత అవుకుగా తీర్చిదిద్దాం



**అవుకు టౌన్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** అవుకును ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదామని ఎంపీడీవో రామ కృష్ణవేణి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అవుకు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశుభ్రత, పచ్చదనం, సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములై గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అందువలన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. అలాగే ఇంటి ఆవరణాల్లో మొక్కలను నాటి మన భూమిని మన పరిసరాలను మనమే కాపాడుకోవాలన్నారు. అనంతరం ప్రజలతో, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో హరిప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని కొనసాగించాలి..!



**పెద్దకడబూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ఆ పథకాన్ని రద్దు చేసి మరొక పథకాన్ని తెస్తామని చెప్పడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తిక్కన్న ఆగ్రహం వ్యక్తం చేశారు శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రమైన పెద్దకడబూరులో తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు.ఆయన మాట్లాడుతూ 2005లో మహాత్మా గాంధీ పేరు మీద తెచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని రద్దుచేసి మరొక చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం సిగ్గుచేటు దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ పథకం ఇప్పటివరకు కోట్లాదిమంది పేద ప్రజలకు ఉపాధి కల్పించిందని ఎంతోమంది యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయని అటువంటి పథకాన్ని రద్దు చేయడం తగదని విమర్శించారు. పేద ప్రజల కోసం ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించి జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 200 రోజులు పని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసలకు వినతి పత్రం అందజేశారు. ప్రజా సంఘ చిన్న తుంబలం హనుమంతు నల్లకుంట శ్రీనివాసులు ఉప్పర ఈరన్న రాముడు తదితరులు పాల్గొన్నారు.

## నూతన చట్టాలకి సంబంధించిన పుస్తకం, క్యాలెండర్‌ను ఆవిష్కరణ



**కర్నూలు, డిసెంబర్ 20, ప్రభాతవార్త ప్రతినిధి :** నంద్యాల జిల్లా డోన్ న్యాయవాది టిడిపి పట్టణ అధ్యక్షులు టి.ఈ.రాఘవేంద్ర గౌడ్ గారికి డోన్ సీనియర్ న్యాయవాది బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు టి.ఈ.వేణుగోపాల్ గౌడ్ భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.శివరామకృష్ణ భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) నూతన డైరీ, నూతన చట్టాలకి సంబంధించిన పుస్తకం, క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. విలేకరుల సమావేశంలో ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు, రాష్ట్ర కార్యవర్గ శివరామకృష్ణ మాట్లాడుతూ న్యాయవాదులకు డైరీ అనేది ప్రతిరోజు వాయిదాలు రాసుకోవడానికి, స్టెప్స్ రాసుకోవడానికి దిన చర్యలో భాగంగా ఉపయోగపడుతుందని, కొన్ని పాత సెక్షన్లను తీసివేసి కొత్త సెక్షన్లు కేంద్రప్రభుత్వం తీసుకురావడం జరిగిందని, ఈ పుస్తకాన్ని ప్రింట్ చేయించి ప్రతి న్యాయవాదికి ఉపయోగపడే విధంగా తయారు చేయించడం జరిగిందని అన్నారు. ఈ పుస్తకము ప్రతి ఒక్క న్యాయవాదికి ఉపయోగపడుతుందని క్యాలెండర్ కోర్టు పని దినాలు, కోర్టు సెలవులను ముద్రించడం జరిగిందని ఇంత అద్భుతమైనటువంటి డైరీ, కొత్త సెక్షన్ల పుస్తకం, క్యాలెండర్ ను ముద్రించి పంపిణీ చేసినటువంటి భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్ కుమార్, ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అన్నారు.

## ప్రతిభచాటిన నంద్యాల విద్యార్థిని..



**నంద్యాల, డిసెంబరు 20, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కె యల్ యూనివర్శిటి వడ్డేశ్వరం గుంటూరు నందు డిసెంబరు 18 నుండి 20 వరకు రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాలు ఆంధ్ర యువ సంకల్ప్ 2025 కార్యక్రమంలో భాగంగా జానపద నృత్యాలు, జానపద గీతాలు, కవితా రచన, కథా రచన, సైన్స్ మేళా, చిత్రలేఖనం అంశాలలో నిర్వహించిన పోటీలలో నంద్యాల జిల్లా మొదటిస్థానంలో నిలిచింది. నంద్యాల జిల్లాలోని న్యూక్లియస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వి శ్రావణికి పెయింటింగ్ అంశంలో 3వస్థానంలో నిలిచి యువజన క్రీడాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంస పత్రం అందుకున్నారు. కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల జిల్లా బృందానికి సెట్కూరు పర్యవేక్షకులు శ్యామ్ బాబు టీమ్ మేనేజర్‌గా వ్యవహరించారు.

## ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపాలి




**మహానంది, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్‌రెడ్డి కోరారు. శనివారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో రైతుసేవా కేంద్రంలో వ్యవసాయశాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ నేలలో సూక్ష్మపోషకాల శాతం తక్కువగా ఉందని రైతులు సేంద్రియ, పచ్చిరొట్టె ఎరువులు నిరంతరాయంగా వాడుట ద్వారా బాగుచేసుకోవచ్చన్నారు. మట్టిపరీక్ష ద్వారా నేలలో సూక్ష్మదాతు లోపాలను నివారించుకోవచ్చన్నారు. చౌడు ఎక్కువగా ఉన్న నేలలను జిప్సం, పచ్చిరొట్టె ఎరువులు నిరంతరాయంగా వాడుట వల్ల బాగుచేసుకోవచ్చని తెలిపారు. మట్టి పరీక్ష ద్వారా నేలలో స్థూల సూక్ష్మపోషకాల శాతాన్ని తెలుసుకోవచ్చని, తద్వారా భూసార పరీక్ష ఫలితాల అధారంగా ఎరువులు వాడటం ద్వారా వ్యసాయంలో ఖర్చుతగ్గించుకోవడంతో పాటు నేలలో నేల పర్యావరణ కాలుష్యాన్ని కూడ తగ్గించుకోవచ్చన్నారు. వరి పంటలో సమగ్ర సస్యరక్షణ సమగ్ర పోషక యాజమాన్యం పద్దతులు అచరించడం ద్వారా ఖర్చును తగ్గించుకొని అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. డిప్యూటి ఎంపిడివో భార్గవి లత, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పవన్‌కుమార్, గోపవరం సొసైటి చైర్మన్ గంగవరపు ఉమా మహేశ్వర్‌రెడ్డి, పశువైద్యాధికారి డా.శివానంద్, ఉద్యాన అధికారి విశ్వద, బిజెపి నాయకులు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## రావూస్ బీకామ్, బిబిఏ విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శన



**ఎమ్మిగనూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** ఎమ్మిగనూరు పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న బీకామ్, బిబిఏ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటన ద్వారా ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘాన్ని మరియు రిలయన్స్ స్మార్ట్ బజార్ ను శనివారం సందర్శించారు. బీకామ్ మహిళా విద్యార్థులు పట్టణ చేనేత సహకార సంఘాన్ని సందర్శించగా అక్కడ పనిచేసే సెక్రెటరీ అప్పాజీ, డిజైనర్ కమ్ మార్కెటింగ్ మేనేజర్ రవికుమార్ క్షేత్ర సందర్శనకు విచ్చేసియున్న మహిళా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ "ఒకరికోసం అందరూ అందరి కోసం ఒకరు అనే నినాదంతో చేనేత సహకార సంఘం పనిచేస్తుందని" ఈ సంఘంలో తయారయ్యే వివిధ చేనేత వస్త్రాల వర్తక క్రయ విక్రయాల పట్ల అవగాహన కల్పించారు. ఇక్కడ తయారయ్యే వివిధ వస్త్రాలు పలు ప్రాంతాలకు రవాణా చేస్తున్నామని వివిధ అకౌంట్స్ పద్ధతులు గురించి కూడా తెలియజేశారు. అదేవిధంగా రిలయన్స్ స్మార్ట్ బజార్ ను సందర్శించారు. ఈ స్మార్ట్ బజార్లో పనిచేసే మార్కెటింగ్ మేనేజర్ వినోద్ కుమార్ వివిధ వస్తువుల అమ్మకాలు, కొనుగోలు పట్ల మహిళా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే మేనేజర్ పదవికి కావాల్సిన వివిధ అర్హతలు, మేనేజింగ్ డైరెక్టర్ క్రింది ఉద్యోగుల పనితీరుపై మానిటరింగ్ విధానం మేనేజర్ అధికార విధులు గురించి తెలియజేశారు. విద్యార్థులు మాట్లాడుతూ ఈ క్షేత్ర స్థాయి సందర్శన ద్వారా మాకెంతో మేలు జరిగిందని పట్టణంలోని వివిధ వాణిజ్య వ్యాపార సంస్థలు దగ్గరికి వెళ్లి సందర్శించడం ద్వారా వస్తువుల అమ్మకాలు మరియు కొనుగోలు పట్ల పూర్తి అవగాహన కలిగిందని అలాగే వివిధ లావాదేవీలు వివిధ అకౌంట్స్ పద్ధతులు , మేనేజర్ డైరెక్టర్ అధికార విధుల పట్ల అవగాహన ఏర్పడిందని విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ క్షేత్ర సందర్శననకు సహకారమంచిన కళాశాల సిఈఓ తిరుమలరెడ్డి గారికి అలాగే కళాశాల అధ్యాపకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చేనేత సహకార సంఘ సెక్రెటరీ అప్పాజీ, మార్కెటింగ్ మేనేజర్ ఎంఈ రవికుమార్, రిలయన్స్ స్మార్ట్ బజార్ మేనేజర్ వినోద్ కుమార్, సీనియర్ అధ్యాపకులైన కామర్స్ విభాగాధిపతి విజయ్ కుమార్, వీరేష్, బిబిఏ విభాగం తరఫున జ్యోతి, సురేఖ కళాశాల బీకామ్ మరియు బిబిఏ విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణంలో ఉపాధి అవకాశాలుపై స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు




**బనగానపల్లె, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర, పర్యావరణంలో ఉపాధి అవకాశాలు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ లలిత అధ్యక్షత వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. లలిత మాట్లాడుతూ పర్యావరణం అంటే మనం పీల్చే గాలి, తాగే నీరు, నివసించే భూమి మాత్రమే కాదు. ఇది మనకు విద్య, ఉపాధి, ఆవిష్కరణలు మరియు స్థిరమైన అభివృద్ధికి సంబంధించిన ఎన్నో అవకాశాలను కూడా అందిస్తుందన్నారు. వృత్తి అవకాశాల గురించి మాట్లాడుకుందాం. ఈ రోజుల్లో పర్యావరణ శాస్త్రంలో పర్యావరణ ఇంజినీర్లు, వాతావరణ శాస్త్రవేత్తలు, వన్యప్రాణి సంరక్షకులు, కాలుష్య నియంత్రణ నిపుణులు వంటి అనేక ఉద్యోగాలు ఉన్నాయన్నారు. వాతావరణ మార్పులు మరియు కాలుష్యం పెరుగుతున్న కారణంగా, ఈ రంగంలో నిపుణుల అవసరం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది అని ఆమె తెలిపారు. ముఖ్య అతిథి కెవికె సైంటిస్ట్ డాక్టర్ లక్ష్మీ ప్రియా మాట్లాడుతూ స్థిరమైన వ్యవసాయం మరియు పర్యావరణ హిత వ్యాపారాలలో అవకాశాలు. సేంద్రీయ వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగం, పర్యాటకం వంటి కార్యకలాపాలు పర్యావరణాన్ని కాపాడుతూ ప్రజలకు ఉపాధిని కల్పిస్తున్నాయి అని ఆమె సూచించారు. శ్రీమతి ఏ. కౌసల్యా దేవి మాట్లాడుతూ పర్యావరణం మనకు బాధ్యతగల పౌరులుగా మారే అవకాశం కూడా ఇస్తుంది. చెట్లు నాటడం, నీటిని ఆదా చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి చిన్న చర్యలు కూడా పెద్ద మార్పును తీసుకురాగలవు అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. మహమ్మద్ గౌస్, డాక్టరు బడే సాహెబ్ డా. వసుందరమ్మ, డా. నీతమ్మ, డాక్టర్ శ్రీ ఉమామహేశ్వర రెడ్డి, డా.రామకృష్ణ శ్రీమతి వరలక్ష్మి, శ్రీమతి ఫాతిమా, శ్రీ అంజనేయులు తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మీఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొండి

**క్రిష్ణగిరి, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** మీ ఇంటి పరిసరాలను చుట్టుప్రక్కల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల యం.పి.డి.ఓ మోహన్‌కుమార్ అన్నారు.శనివారం రోజు మండల కేంద్రమైన క్రి ష్ణగిరిలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంను మండల స్థాయి అదికారులు,సచివాల యం ఉద్యోగులతో నిర్వహించారు.గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ ఇంటి పరిసరాలను,గ్రామ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికికాలువల్లో నీరు నిలువ చేరకుండా చూసుకోవాల న్నారు.ఇలా చేయడం వలన మనకు వచ్చే చాల రకాల వ్యాదులను రాకుండా చేయవచ్చు నన్నారు.దోమలు వ్యాప్తి చెందవు అన్నారు. పరిశుభ్రమైన ఆహారపదార్థాలు,నీరు మనం ఉపయోగించాలన్నారు.మనం పిల్లలకు ఇవి నేర్పించాలన్నారు. ఆదివారం రోజు జరిగే పల్స్ పోలియో ఏర్పాట్లను పరిశీలించారు. పక్బందిగా పోలియో కార్యక్రమంను విజయవంతం చేయాలని వైద్యాదికారులకు యం.పి.డి.ఓ సూచించారు. మండల టి.డి.పి అధ్యక్షులు రామకృష్ణాపురం దామోదర్‌నాయుడు,మండల అదికారులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఈ జయప్ప



**రుద్రవరం, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రుద్రవరం మండల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా ఈ జయప్ప శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ మహమ్మద్ రఫీ కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లగా ఉన్నతాధికారుల అదేశాల మేరకు ఆళ్లగడ్డ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జయప్పను రుద్రవరం మండల పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా నియమిస్తు ఉత్తర్వులు జారీచేశారు. ఈసందర భంగా ఎస్ఐ జయప్ప మాట్లాడుతూ ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ సత్వరమే ప్రజా సమస్యల పరిష్కారం చేసే దిశగా ముందుంటానని గ్రామాల్లోని ప్రజల శాంతిభద్రతల కొరకు ఎలాంటి అవవసరం నా ఫోన్ నం.9963606075 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. మండలంలోని గ్రామాల్లో శాంతిభద్రతలకు మరియు ట్రాఫిక్ నియంత్రణకు విఘాతం కలిగించినా, చట్టాన్ని దిక్కరించినా అటువంటి వారిపై ఉక్కుపాదం మోపుతానని ఆయన హెచ్చరించారు.

## 5 సంవత్సరాల పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించాలి



**ఆళ్లగడ్డ, డిసెంబరు 20, ప్రభాతవార్త:** 0నుండి 5 సంవత సరాల పిల్లందరికి పోలియో చుక్కలు వేయించాలని అహోబిలం ప్రాధమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ లిఖీత్‌రెడ్డి తెలిపారు. శనివారం అహోబిలం ప్రాధమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని 23 పోలియో కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ చిన్నారుల జీవితానికి రక్షణ అన్నారు. 0-5 సంవత సరాల చిన్నారులందరికి ఆదివారం రెండు చుక్కలు పోలియో వ్యాక్సిన్ నోటి ద్వారా తప్పక ఇప్పించాలని ఆయన తెలిపారు. అనంతరం పల్స్‌పోలియో కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తు ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిటి హెల్త్ అఫీసర్ సుగుణ, డిప్యూటి హెల్త్ ఎడ్యుకేషన్ అఫీసర్ వెంకటరమణ, ఆరోగ్యకార్యకర్త రామరావు, నాల్గవ తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

## పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ



**రుద్రవరం, డిసెంబరు 20, ప్రభాతవార్త:** మండలంలోని నర్సాపురం ప్రాధమిక వైద్యాధికారులు బాబు, జయలక్ష్మీ ఆధ్వర్యంలో శనివారం పల్స్‌పోలియో అవగాహన కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21న నర్సాపురం ప్రాధమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని అన్ని గ్రామాల్లో పల్స్‌పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగు 22, 23 తేదిల్లో గృహాదర్శనాలు చేసి అప్పుడే పుట్టిన బిడ్డలకు కూడ పల్స్‌పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. నర్సాపురం ఆరోగ్యకేంద్ర పరిధిలో 752 మంది ఐదు సంవత సరాలలోపు పిల్లలను గుర్తించామని వారికి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఆరోగ్యకేంద్ర సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

## ఏటిఎం మోడల్‌ను పరిశీలించిన ఎపిఎం కళావతి



**పగిడ్యాల, డిశంబరు 20, ప్రభాతవార్త :** పగిడ్యాల కుమ్మరి వీదిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అయిన యూనిట్ ఇన్‌చార్జ్ సుబ్బమ్మ వేసిన ఎటిఎం మోడల్‌ను శనివారం ఎపిఎం కళావతి పరిశీలించారు. మోడల్ నమూనాను గురించి అమె తెలుసుకున్నారు. ఎపిఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు ఎటిఎం మాడల్‌ను వేసుకుని నిరంతరం ఆదాయం పొందవచ్చన్నారు. ఎపిసిఎన్ఎఫ్ యూనిట్ సుబ్బమ్మను ఎపిఎం కళావతి అభినందించారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళలు సంజమ్మ, జోష్న, ఐసిఆర్‌పి మురళిమోహన్ పాల్గొన్నారు.

## కార్గో డోర్ డెలివరీ సర్వీసును సద్వినియోగం చేసుకోండి



**ఆదోనీగల్, డిసెంబరు 20, ప్రభాతవార్త;** ఏపీఎస్ ఆర్టీసీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కార్గో డోర్ డెలివరీ సర్వీసును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆదోని ఆర్టీసీ డీఎం మహమ్మద్‌రఫిక్ తెలిపారు. శనివారం ఆర్టీసీ డిపోలో గేట్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడారు. ప్రతి ఉద్యోగి ఈ సర్వీసును ఉపయోగించుకోవాలన్నారు. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండగల నేపథ్యంలో సరసమైన ధరలకే డోర్ డెలివరి సర్వీసు ఉంటుందన్నారు. ఈనెల 20 నుంచి జనవరి 19వ తేదీ వరకు ఈ కార్గో సర్వీసు ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 80 ప్రాంతాల్లో ఈ సర్వీసు ఉందన్నారు. వాట్సాప్ ద్వారా కూడా ప్రజలు ఆర్టీసీ బస్సు రిజర్వేషన్‌ను చేసుకోవచ్చన్నారు. వివరాలకు ఆర్టీసీ డీఎంను ఆర్టీసీ బస్టాండులో విచారణ కౌంటర్‌ను సంప్రదించి వివరాలు పొందవచ్చన్నారు. ఆర్టీసీ గ్యారెంట్ అసిస్టెంట్ ఇంజనీర్ వేణుగోపాల్, ట్రాఫిక్ ఇన్‌చార్జి మల్లికార్జున, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పార్వతీశం, సిబ్బంది పాల్గొన్నారు.

## కుంకనూరులో సాంస్కృతిక దీక్ష యజ్ఞం



**దేవనకొండ, డిసెంబరు 20, ప్రభాతవార్త;** మండలంలోని కుంకనూరు గ్రామంలో హిందూ ధర్మ ప్రసార విభాగం ఆధ్వర్యంలో సాంస్కృతిక దీక్ష యజ్ఞాన్ని నిర్వహించినట్లు ప్రాంత సహ ప్రముఖ్ అంకాలయ్య తెలిపారు. శనివారం నిర్వహించిన సాంస్కృతిక దీక్ష యజ్ఞానికి దళితవాడలో 50 కుటుంబాలు పాల్గొన్నాయి. మంత్రోచ్ఛరణతో ఈ దీక్ష యజ్ఞాలు జరిగాయి. ఈ దీక్ష యజ్ఞాలు అనంతరం ప్రముఖులు హిందూ సంస్కృతిని గురించి హిందూ ధర్మ పరిరక్షణ గురించి ప్రసంగించారు. ప్రధానంగా దళితులు మతమార్పిడి వైపు మొగ్గు చూపు తున్నారని,అలాగాకుండా వారిని హిందూమతంలోనే కొనసాగించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లా సహకార్యదర్శి ఆనందరెడ్డి, జిల్లా సత్సంగ్ ప్రముఖ మల్లన్న, జిల్లా సంఘటన ప్రముఖ జిల్లా ధర్మప్రసాద్, సీతారామయ్య, మండల ధర్మ ప్రసార కౌలుట్లయ్య, సహకార జిల్లా సహ కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, కుంకనూరు గ్రామ ప్రముఖ లింగారెడ్డి, మండల వీహెచ్‌పీ ప్రముఖ భీమేష్, గ్రామపెద్దలు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## విజ్ఞాన యాత్రలతో విద్యార్థులకు జ్ఞానం పెరుగుతుంది



**మంత్రాలయం, డిసెంబరు 20, ప్రభాతవార్త;** విజ్ఞాన యాత్రలతో విద్యార్థులకు జ్ఞాన పెరుగు తుందని తుంగభద్ర పాంతాల హెచ్‌ఎం భవాని అన్నారు. శనివారం మండలంలోని తుంగభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థులు సుమారు 109 మందిని విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పీఎంశ్రీ స్కూల్ ఎక్స్పోజర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా పుణ్యక్షేత్రమైన యాగంటి, బెలుంగుహల సందర్శనకు వెళ్లినట్లు తెలిపారు. యాగంటి దేవాలయం చరిత్ర, ప్రకృతి రమణీయతకు గుర్తుగా ఏర్పడిన బెలుంగుహల విశిష్టతను విద్యార్థులకు తెలియజేశామన్నారు. ఉపాధ్యాయులు కన్నడ రాజు, నారాయణ, రవికుమార్, భాస్కర్‌రెడ్డి, గురురాజా, సునీత, జమృద్దీన్, రామసుబ్బమ్మ, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

## ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నాయకులు



**మంత్రాలయం, డిసెంబరు 20, ప్రభాతవార్త;** మంత్రాలయం నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునను మంత్రాలయం టీడీపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ సీనియర్ నాయకులు అశోక్‌రెడ్డి, పట్టణాధ్యక్షులు వరదరాజులు ఆధ్వర్యంలో ఎస్ఐను కలిసి సత్కరించారు. పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేష్, నరసింహులు, గుడిసె రాజన్న, రఘు పాల్గొన్నారు.

## పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**హొళగుంద, డిసెంబరు 20, ప్రభాతవార్త;** ఈనెల 21వ తేదీన జరిగే పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని అన్నిశాఖల అధికారుల సహకారంతో విజయవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ నారాయణమూర్తి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ విజయలలిత ఆధ్వర్యంలో ఆయన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షీబారాణి, ఎంఈఓ-1 సుధారాణి, డిప్యూటీ ఎంపీడీఓ చక్రవర్తిలతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామన్నారు. అన్నిశాఖల అధికారులు పల్స్‌పోలియో కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 0-5 సంవత్సరాల్లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలన్నారు. మండలంలో పారిశుద్ధ్యం విషయంలో పంచాయతీ కార్యదర్శులు, ఐవీఆర్ఎస్ సర్వేలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదన్నారు.

## పచ్చని ప్రకృతితోనే పర్యవరణ సమతుల్యత సాధ్యం



**గోనెగండ్ల, డిసెంబరు 20, ప్రభాతవార్త :** పచ్చని ప్రకృతితోనే పర్యావరణ సమతుల్యత సాధ్యం అవుతుందని రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ,మాజీ ఎంపీపీ హనుమంతు, మాజీ సంజన్న అన్నారు. గాజులదిన్నె గ్రామంలో మూడవ శనివారం స్వర్ణఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కింద గ్రామంలోని పలు వీదులలో పంచాయతీ,సచివాల సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. బస్‌స్టాండ్ ప్రాంగణం నందు మానవహారం ఏర్పాటు చేశారు.ఉద్యోగులు,గ్రామ ప్రజలచే కార్యదర్శి మద్దిలేటి స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రతి రోజు పర్యవరణ పరిశుభ్రత కోసం కోంత సమయంను కేటాయించాలని కోరారు. ప్రకృతి పచ్చధనం ప్రాముఖ్యతను వివరించారు.గ్రామలోని వీదుల్లో మొక్కలు నాటారు. గాజులదిన్నె మత్స్య సంఘం అధ్యక్షుడు రంగస్వామినాయుడు, వేణుగోపాలచారి, జయరాముడు, టీడీపీ నాయకుడు చంద్ర, కాంట్రాక్టర్ నాగన్న, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలతో.. సృజనాత్మకత

**: తల్లిదండ్రులు పిల్లల నైపుణ్యాలను ప్రోత్సహించాలి జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



**కర్నూలు, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యం, పరిశోధనా దృక్పథాన్ని వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు కీలకంగా ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. శనివారం ఉదయం కర్నూలు నగరంలోని ప్రభుత్వ టౌన్ మోడల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలు, ప్రయోగాలు, వినూత్న ఆవిష్కరణలను పరిశీలించి వారి ప్రతిభను అభినందించారు. జిల్లాలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను మొత్తం ఏడు థీమ్స్‌తో నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాల స్థాయి ప్రదర్శనలు డిసెంబర్ 16న, మండల స్థాయి ప్రదర్శనలు 17న, జిల్లాస్థాయి ప్రదర్శనలు 20న నిర్వహించినట్లు వివరించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన 11 మంది విద్యార్థులను ఈ నెల 23న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. పాఠ్యాంశాలతో పాటు ప్రాయోగిక విద్య కూడా విద్యార్థుల భవిష్యత్‌కు అత్యంత కీలకమని పేర్కొంటూ, శాస్త్రీయ ప్రదర్శనలు ప్రశ్నించే మనస్తత్వాన్ని, సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. నేడు రూపొందిస్తున్న చిన్న ఆవిష్కరణలే రేపటి గొప్ప ఆవిష్కరణలకు పునాది అవుతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రతిభను గుర్తించి వారి అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల విజ్ఞాన వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, వారు నిరంతరం మార్గనిర్దేశం చేయాలని పేర్కొన్నారు. ముస్తాబు కార్యక్రమం పరిశీల నపాఠశాలలో ఏర్పాటు చేసిన ముస్తాబు కార్నర్ పాయింట్‌ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, సానుకూల అలవాట్లను పెంపొందించే లక్ష్యంతో అమలు చేస్తున్న ముస్తాబు కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వ్యక్తిగత పరిశుభ్రత, శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణ, సక్రమ ఆహార అలవాట్లు పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. ప్రతి పాఠశాలలో ముస్తాబు కార్నర్ ఏర్పాటు చేసి అద్దం, దువ్వెన, నెయిల్ కట్టర్, సబ్బు, నీటి సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.సుధాకర్, జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్ అధికారి రంగమ్మ, సమగ్ర శిక్ష ఏపీసీ డా.లోకరాజు, పాఠశాల ప్రిన్సిపల్ ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమం




**కర్నూలు హాస్పిటల్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఇంచార్జి సూపరింటెండెంట్ డా. లక్ష్మీబాయి గారి నేతృత్వంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరియు శానిటేషన్ సిబ్బంది స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డా. లక్ష్మీబాయి గారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణం శుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది అందరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. అలాగే ఆసుపత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకమని, వాటి వేరు చేయడం, సేకరణ మరియు నిర్వహణ నిబంధనలను ప్రతి సిబ్బంది తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా సదరం బ్లాక్ వద్ద వైద్యులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ప్రజలకు అందించే వైద్య సేవల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం అత్యవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా. నాగేశ్వరరావు, సి ఎస్ ఆర్ ఎమ్ ఓ డా. పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, అసోసియేట్ ప్రొఫెసర్ డా. శివబాల, ఏ ఆర్ ఎం ఓ డా. క్లింటన్, నర్సింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ్ ఆంధ్ర.. స్వర్ణాంధ్రలో పొరక పట్టి చెత్తను ఊడ్చిన ఎమ్మెల్యే



**నందికొట్కూరు,డిసెంబరు 20,ప్రభాతవార్త:** మాటల్లో కాదు చేతల్లో చూపాలన్న ఆశయంతో స్వచ్ఛ్ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పొరక చేతపట్టి చెత్తను ఊడ్చారు. శనివారం మండల పరిధిలోని వడ్డెమాను గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ్ ఆంధ్ర..స్వర్ణాంధ్ర కార్యక్రమంలో బాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే పాల్గొని చెత్తను ఊడ్చడడంతో వెంటనే అధికారులు కూడా పొరక చేతపట్టి చెత్తను ఊడ్చివేసి శుభ్రం చేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు స్వచ్ఛ్ఆంధ్ర..స్వర్ణాంధ్ర లో ప్రతి ఒక్కరు భాగస్వాములై పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాల గురించి అధికారులు ప్రజలకు అవగాహన కలిగించాలని, ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని, ప్లాస్టిక్ రహిత గ్రామాల ఏర్పాటు కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన తెలిపారు. అంతకు ముందు అధికారులు, నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సుబ్రమణ్యం శర్మ, తహసిల్దార్ బి.శ్రీనువాసులు, గ్రామ సర్పంచ్ రామచంద్రుడు, డిప్యూటి ఎంపిడిఓలు, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన బిసి రాజారెడ్డి



**బనగానపల్లె డిసెంబర్ 20 ప్రభాతవార్త :** పట్టణం లోని పెండేకంటి వెంకటసుబ్బయ్య ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి శనివారం ప్రారంభించారు. కీ.శే. బిసి బాల తిమ్మారెడ్డి గారి జ్ఞాపకార్థం ఆయన సోదరుడు బిసి రాజారెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు బిసి రాజారెడ్డి పోటీలను ప్రారంభించి కొద్దిసేపు షటిల్ ఆడారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మా సోదరుడు బిసి బాల తిమ్మారెడ్డి గారికి షటిల్ బ్యాడ్మింటన్ ఆట ఎంతో ఇష్టమని గుర్తు చేసుకున్నారు. ప్రపంచ స్థాయిలో షటిల్ క్రీడకు గుర్తింపు ఉందన్నారు. క్రీడల వల్ల మానసిక ఒత్తిడి జయించడంతోపాటు శారీరకంగా దృఢత్వం లభిస్తుంది అన్నారు. ఆరోగ్యపరంగా ఎన్నో లాభాలు కూడా ఉన్నాయన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 85 టీంలు పోటీలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. ఇలాంటి పోటీల వల్ల క్రీడాకారుల మధ్య స్నేహ పూర్వక వాతావరణం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్తాఫ్ హుస్సేన్, భానుముక్కల సొసైటీ చైర్మన్ కలాం, ౹౹ కృష్ణారెడ్డి బొబ్బల మద్దిలేటి రెడ్డి, మోయిన్ శంకరయ్య డాక్టర్ పిచ్చయ్య, సుబ్రహ్మణ్యం నెహ్రూ స్కూల్ డైరెక్టర్ రవితేజ రెడ్డి, మధు, ఇస్మాయిల్ ఖాన్, మోహన్ రెడ్డి మక్బూల్, పుల్లయ్య, బండి హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, సతీష్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు

# బాల్య వివాహాలతో.. ఎన్నో అనర్థాలు



**కర్నూలు లీగల్, డిసెంబర్ 20, ప్రభార్తవార్త :** బాల్య వివాహాలు తో వారి జీవితం అన్నర్థదాయకంగా ఉంటుందని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్, డీఎల్ఎస్ వాలింటీర్ త్రినాథ్ కుమార్ అన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ అధికార సంస్థ కర్నూలు వారి సూచనల మేరకు 100 రోజుల బాల్య వివాహ రహిత భారత్ కార్యక్రమంలో భాగముగా నగరంలో వెంకట రమణ కాలనీ లయన్స్ క్లబ్ ఆఫీస్ నందు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వాలంటీర్ రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ త్రినాథ్ కుమార్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలతో వారి జీవితాలు చిన్నాబిన్న మవుతుందని అన్నారు. వారి ఉన్నత చదువులు చదివించి భవిష్య త్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎక్కడైన బాల్య వివాహాలు జరుగుతుంటే ఆ సమాచారాన్ని చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కానీ లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్15100 గాని కాల్ చేస్తే వారు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని నిలుపుదల చేస్తారని తెలిపారు. అనంతరం పిల్లలచే బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, రిటైర్డ్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, రిటైర్డ్ డిఎం హెచ్ఓ డాక్టర్ రంగనాథ్ డాక్టర్ జయప్రకాష్ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శంకరప్ప, కాలనీ వాసులు పాల్గొన్నారు. ఫొటో 1 :బాల్యవివాహాలను అరికట్టాలని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

# స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

**: కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడమే ఆశయం**



**ఆత్మకూరు డిసెంబర్ 20 ప్రభాతవార్త :** పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రఖ్ కార్యక్రమంలో పాల్గొని స్కూల్ ఆవరణలో ప్రతి విద్యార్థినిలతో చదువుతోపాటు సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించి, ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ పరిశుభ్రం ఎంతో ముఖ్యమని తెలియజేశారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధన మధ్యాహ్నం భోజనం పథకం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని గుర్తు చేసిన విద్యార్థులు భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవడంలో అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు , ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాల గురించి ప్రజలలో అవగాహన కల్పించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. "స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, పచ్చగా ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్లాస్టిక్ రహిత కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలి," అని ఆయన పిలుపునిచ్చారు. డిసెంబర్ 21 న రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 05 ఏళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేశారు ఆదివారం రోజు నిర్వహించే శిబిరాలలో పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, వైద్యసిబ్బంది గ్రామాలలో ఐదేళ్ల లోపు చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలియో చుక్కలు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. మన పిల్లలకు బంగారు భవిష్యత్తును అందిద్దాం అని అన్నారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు మండల విద్యాశాఖ అధికారులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టిడిపి పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం భాష మండల అధ్యక్షుడు రవీంద్రబాబు టిడిపి సీనియర్ నాయకులు మోటార్ షఫీ ఉల్లా మిట్ట కందాల మహబూతుల, టిడిపి మండల సీనియర్ నాయకులు శివప్రసాద్ రెడ్డి మైనార్టీ నాయకులు పటాన్ నాగూర్ ఖాన్ వివిధ శాఖల అధికారులు టిడిపి నాయకులు కార్యకర్తలు విద్యా కమిటీ చైర్మన్ ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు

# యాగంటి ఉమామహేశ్వర స్వామిను దర్శించుకున్న బీసీ ఇంద్రారెడ్డి

**బనగానపల్లె డిసెంబర్ 20 ప్రభాత వార్త :** రోడ్ల భవనాల శాఖ మంత్రి సతీమణి శ్రీమతి బి.సి.ఇందిరమ్మ శ్రీ ఉమామహేశ్వర స్వామి వారిని శనివారం దర్శించుకున్నారు. మండలంలోని యాగంటి లో వెలిసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి వార్లను దర్శనార్థం విచ్చేసి స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించడం జరిగినది. బీసీ ఇందిరమ్మ ఆలయం నకు చేరుకోగానే ఆలయ ఈవో పాండురంగారెడ్డి, యాగంటి పల్లె ఉపసర్పంచ్ మోలీశ్వర రెడ్డి ఆలయ అర్చకులు మహేష్ శర్మ, సత్యనారాయణ శర్మ ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి శ్రీ ఉమామహేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమము నందు పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి మీరాపురం బత్తుల నారాయణరెడ్డి పాతపాడు సంగు శంకేశ్వర రెడ్డి,భరతుడు, జక్కల సురేష్ ఆలయ అర్చకులు రాఘవేంద్ర శర్మ,దేవేంద్ర శర్మ,లోకనాథ్ శర్మ,సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలల్లో పరిశుభ్రతకు అధికారులు చర్యలు తీసుకోవాలి

**– టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి**




**మంత్రాలయం, డిసెంబరు 20, ప్రభాతవార్త;** మంత్రాలయం నియోజకవర్గంలోని అన్ని మండలాల గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులు పరిశుభ్రత పాటించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల గదులను, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ప్రభుత్వం ప్రతి పాఠశాలలో ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కావునా మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజారెడ్డి, టిప్పుసుల్తాన్, సురేష్‌నాయుడు, అడివప్పగౌడ్, ఎంపీడీఓ నూర్జహాన్, ఎంఈఓ మొయినుద్దీన్, సీడీపీఓ రాజేశ్వరి, ఎస్ఎంసీ చైర్మన్ ఆంజనేయులు, హెచ్ఎం భోజరాజు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతను.. జీవితశైలిగా మార్చుకోవాలి

**– కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం**
**– జిల్లా రెవిన్యూ అధికారి రామునాయక్**



**నంద్యాల, డిసెంబరు 20, ప్రభాతవార్త ప్రతినిధిః** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాల్గొని పరిశుభ్రతను జీవితశైలిగా మార్చుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి రామునాయక్ పేర్కొన్నారు. శనివారం నంద్యాల కలెక్టరేట్ కార్యాలయ అవరణలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డిఆర్వో రాము నాయక్ మాట్లాడుతూ ప్రతినెల 3వ శనివారం రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్య క్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పరిశుభ్రత అనేది ఒకరోజు, ఒక నెలలోజరిగే కార్యక్రమం కాదని అది ప్రతిఒక్కరి జీవితంలో భాగంగా మారాలని తెలిపారు. మన రాష్ట్రాన్ని జిల్లాను, మండలాన్ని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోగలమన్నారు. పరిశుభ్రత లోపిస్తే అనేక ఆరోగ్య, పర్యావరణ సమస్యలు ఎదురవుతాయని పరిశుభ్రతను వ్యక్తిగత బాధ్యతగా సామాజిక కర్తవ్యంగా భావించి ప్రతిఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యకర జీవనానికి సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందన్నారు. ఈసందర ్భంగా కలెక్టర్ సిబ్బంది కార్యాలయ ప్రాంగణంలో చెత్తను తొలగించి మొక్కల సంరక్షణ పరిసర పరిశుభ్రత వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం డిఆర్వో రామునాయక్ అధికారులు సిబ్బందితో కలిసి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

# హెల్మెట్ లేకపోతే.. ఒక కుటుంబం రోడ్డున పడుతుంది

**: హెల్మెట్ ధరించండి ప్రాణాలను కుటుంబాన్ని కాపాడుకోండి**
**: ఆదోని డిఎస్పీ హేమలత**

**ఆదోని క్రైమ్ డిసెంబరు 20, ప్రభాతవార్త;** ఆదోని పట్టణంలో ట్రాఫిక్ నిబంధనల పై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో రూ.1000 జరిమానా విధిస్తామని డీఎస్పీ హేమలత హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆమె వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు . ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి ప్రమాదాల నుండి ప్రాణాలను కుటుంబాన్ని కాపాడుకోవాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో ఆదోని ట్రాఫిక్ సిఐ గౌస్ మరియు సిబ్బంది పాల్గొన్నారు




# పల్స్ పోలియో అవగాహనా ర్యాలీ



**కర్నూలు హాస్పిటల్ డిసెంబర్ 20 ప్రభాతవార్త** కర్నూలులో ఉదయం 9 గంటలకు కలెక్టర్ కార్యాలయం నుండి మెడికల్ కాలేజీ వరకు పల్స్ పోలియో అవగాహనా ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీని జాయింట్ కలెక్టర్ శ్రీమతి నూరుల్ ఖమర్ గారు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ భాస్కర్ గారితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. పోలియోపై నిర్లక్ష్యం చిన్నారుల భవిష్యత్తుకు ప్రమాదమని హెచ్చరించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ గారు మాట్లాడుతూ, పల్స్ పోలియో కార్యక్రమానికి అవసరమైన మెటీరియల్‌ను అన్ని ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేశామని, పోస్టర్లు, బ్యానర్ల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ మరియు ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

**– ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ**



**ఆళ్లగడ్డ, డిసెంబరు 20, ప్రభాతవార్తః** ఇటీవల ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చిన ఆర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ అధికారులకు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాలూకలోని ఆరు మండలాల ఎంపీడివోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె అయా మండలాల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి, ఎక్కువ సమస్యలు ఏ అంశంపై ఉన్నాయి అని వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై అధికారులతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అలాగే పి-4 ప్రొగ్రామ్‌పై కూడ సమీక్ష సమావేశం నిర్వహించారు. బంగారు కుటుంబాల ఎంపిక, ఇతర కార్యక్రమాలపై సమీక్షించారు. ఈకార్యక్రమంలోని తాలూకలోని 6 మండల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడివో కార్యాలయ అవరణలో ఎంపీడివో నూర్జహాన్ ఆద్వర్యంలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో మండల అధికారులు, ఎంపీడివో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వార్త

**న్యూస్ కంట్రీబ్యూటర్లు కావలెను**

జర్నలిజం పట్ల ఆసక్తి కలిగి ఇంటర్మీడియట్ కనీస విద్యార్హత కలిగిన అభ్యర్థుల నుండి కర్నూలు, నంద్యాల జిల్లా లోని.. క్రింది ప్రాంతాల్లో న్యూస్ కంట్రీబ్యూటర్లు విలేకరులు గా పని చేయుటకు దరఖాస్తులు కోరడమైనది.

**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలసిన ప్రాంతాలు**

- డోన్
- ఆత్మకూరు రూరల్,
- పాణ్యం
- చిప్పగిరి
- ఓర్వకల్

ఆసక్తి గలవారు ఈనెల 21 వ తేదీ ఆదివారం జరిగే ఇంటర్వ్యూకు హాజరు కాగలరు

పూర్తి వివరములకు సంప్రదించాల్సిన నెం : 9848387561

ADDRESS : VAARTHA UNIT OFFICE, INDUSTRIAL AREA - KALLURU ESTATE 518003